క్లుప్తంగా

ఎంపీడీఓగా దీక్షితులు



ముమ్మిడివరం: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా జేవీఎల్ఎన్ దీక్షితులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అమలాపురం పంచాయతీరాజ్ ఈఈ కార్యాయలంలో ఏఓగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా.. దీక్షితులును ఎంపీపీ కోలా గంగా భవాని, కోలా బాబ్జీ, మండల పరిపాలనాధికారి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అభినందించారు.

ఉప్పలగుప్తానికి కృష్ణ..



ఉప్పలగుప్తం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ ఏవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

అమలాపురం రూరల్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, జన కళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కామనగరువులోని అమలాపురం డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రివెన్షన్ యూనిట్ టీఐ ప్రాజెక్ట్ మేనేజర్ జి.శ్రీను మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్, మత్తు మందుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ కె.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం ఆక్రమణపై ఫిర్యాదు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామానికి చెందిన అనుకూలి రాము శ్మశానం భూమిని ఆక్రమించి, తప్పుడు పత్రాలు సృష్టించి క్రయ, విక్రయాలకు పాల్పడుతున్నాడని ఆ గ్రామానికి చెందిన ఎ.బాబూరావు, ఎ.శ్రీనివాసరావు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని శ్మశానాన్ని ఆక్రమించి పక్క సర్వే నెంబరు 174తో దస్తావేజులు సృష్టించారన్నారు. సుమారు 120 ఏళ్లకు పైగా రెవెన్యూ రికార్డులలో ఆ భూమి శ్మశానంగా నమోదై ఉందన్నారు.

చైతన్య రథంతో ప్రచారం

అమలాపురం రూరల్: మాదక ద్రవ్యాలు, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై జన జాగృతి చైతన్య రథం ద్వారా గ్రామాలలో ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం రాత్రి అమలాపురం మండలం కామనగరువు పరిధిలోని ఎర్రవంతెన వద్ద రథం నుంచి పవర్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజలను చైతన్య పరిచారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ఎంపీ గంటి హరీష్ మాధూర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు.

సచివాలయ భవనం ప్రారంభం

కాట్రేనికోన: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.35 లక్షలతో కాట్రేనికోనలో నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనాన్ని బుధవారం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, ఆక్వా డైరెక్టర్ విత్తనాల బుజ్జి, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ఐ.పోలవరం: మండలంలోని కేశనకుర్రులో పీఆర్ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, శాసన మండలి సభ్యుడు పేరాబత్తుల రాజశేఖర్ బుధవారం శంకుస్థాపన చేశారు. అంతకు ముందు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన సాగిరాజు సూరిబాబు రాజును సత్కరించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఉప్పలగుప్తం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్సై సీహెచ్ రాజేష్ సూచించారు. గొల్లవిల్లి సీఎస్ఎం కాలేజీ విద్యార్థులతో బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మత్తు పదార్థాలు తాగడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. యువత చెడు వ్యసనాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

పలువురికి వైద్యసేవలు

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఉదయలక్ష్మి దంపతుల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఏసియన్ వ్యాస్కులర్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని మల్లాడి కృష్ణారావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా దృక్పథంతో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నానన్నారు. అనంతరం యానాం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, గిడ్ల చంద్రరావు పాల్గొన్నారు.

అంతన్నారు.. ఇంతన్నారు..

- ఇంజరం వంతెన నిర్మాణమెప్పుడో!
- నెరవేరని పాలకుల హామీ
- తూరల వద్ద పేరుకుపోతున్న చెత్తా చెదారాలు
- ఏళ్ల తరబడి రైతులు, వాహన చోదకుల ఇబ్బందులు



శిథిలస్థితికి చేరి నిరుపయోగంగా మారిన ఇంజరం వంతెన



కల్వర్టు వద్ద పేరుకపోయిన చెత్తాచెదారం

తాళ్లరేవు: ఇంజరం వంతెన శిథిలమై ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి మాత్రం నోచుకోవడం లేదు. మూడు నెలల్లో నిర్మిస్తాం, ఆరు నెలల్లో నిర్మిస్తామంటూ పాలకులు చెబుతున్న మాటలు కార్యరూపం దాల్చడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో ఇంజరం వంతెనను నిర్మిస్తామంటూ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రకటించారు. అయితే ఏడాదిన్నర గడుస్తున్నా వంతెన నిర్మాణం జరగలేదు. కనీసం పనులు కూడా మొదలు పెట్టకపోవడం గమనార్హం. దీంతో అటు ప్రయాణికులు, ఇటు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వరినాట్లు ఆలస్యం

సుమారు వందేళ్ల క్రితం బ్రిటిషు పాలకులు నిర్మించిన ఈ వంతెన శిథిలం కావడంతో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. వంతెనకు బదులుగా తూరలు ఏర్పాటు చేశారు. అదే రైతుల పాలిట శాపంగా మారింది. యానాం – ద్రాక్షారామ రహదారిలో ఇంజరం వద్ద పంట కాలువపై ఉన్న వంతెన శిథిలమవడంతో వంతెన పక్కనే తాత్కాలికంగా తూరలతో కల్వర్టు నిర్మించారు. సాగునీరు వెళ్లేందుకు భారీ తూరలను వేసినప్పటికీ వాటి వద్ద చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీరు పారని దుస్థితి నెలకొంది. ఈ కారణంగా పంట ఆరంభంలోనే నిర్ణీత సమయంలో ఆకుమడులు పడక, వరినాట్లకు ఆలస్యమైంది. త ద్వారా ఏడాదికి మూడు పంటలు పండే భూముల్లో రెండు పంటలు పండించడం కూడా గగనంగా మారింది.

సాగునీటి ఇబ్బందులు

ఇంజరం వంతెన నిర్మించకపోవడంతో ప్రతి ఏడాది రెండు వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం కలుగుతోంది. ఈ వంతెన వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టుల వద్ద భారీగా వ్యర్థాలు పేరుకుపోవడంతో సాగు నీరు ముందుకు పారడం లేదు. వ్యర్థాలను ప్రతి రోజూ తొలగించకపోవడంతో శివారు ప్రాంతాలకు సాగు నీరందక ఖరీఫ్, రబీ పంటల్లో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాళ్లరేవు, పి.మల్లవరం, పోలేకుర్రు, జార్జిపేట, నీలపల్లి, గాడిమొగ ప్రాంతాల్లోని శివారు భూములకు నీరు అందక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

అదనపు భారం

ఈ కాలువల పరిధిలో సుమారు ఎనిమిది వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుండగా సుమారు రెండు వేల ఎకరాలకు పైగా నీటి ఎద్దడి ఏర్పడుతోంది. దీని వల్ల ప్రతి ఏటా ఎకరాలకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకూ అదనపు భారం పడుతోందని రైతులు వాపోతున్నారు. తమ సమస్యలన్నింటికీ ప్రధాన కారణమైన ఇంజరం వంతెనను తక్షణమే నిర్మించి పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా.. దీనిపై రహదారులు భవనాల శాఖ జేఈ వి.లక్ష్మీ ప్రసన్నను వివరణ కోరగా వంతెన నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు పంపామన్నారు. డిజైన్స్ అండ్ ప్లానింగ్ అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు పిలుస్తామని తెలిపారు.

పనులు తక్షణమే ప్రారంభించాలి



ఇంజరం వంతెన వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక తూరల కల్వర్టు వద్ద చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. దీంతో సాగుకు తీవ్ర జాప్యం జరుగుతోంది. ముఖ్యంగా ఖరీఫ్‌లో పంట ఆలస్యం కావడంతో ఆ ప్రభావం దిగుబడిపై పడుతోంది. వేసవి కాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. దాళ్వా సాగులో వరి పంట చేతికి వచ్చే సమయంలో ఈ సమస్య కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి, తక్షణమే ఇంజరం వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– వల్లు రాజబాబు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి

సత్యదేవ కాకినాడ జిల్లాగా నామకరణం చేయాలి



పిల్లంకలో మాట్లాడుతున్న కాశిబాబు

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు సత్యదేవ కాకినాడ జిల్లాగా నామకరణం చేయాలని వేద పండితుడు వేలూరి వెంకట కామేశ్వర శర్మ (కాశిబాబు) తదితరులు డిమాండ్ చేశారు. పిల్లంక గ్రామంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. కాశిబాబు మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతూ కోరిన కోర్కెలు తీర్చే అన్నవరం వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఖ్యాతి దశదిశలా వ్యాపింపజేసేందుకు ఈ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తోలేటి శ్రీనివాస్, శివరామరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సాయం

అమలాపురం రూరల్: జోగివారిపాలెం శివారు గౌతమీ నగర్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ఇసుపట్ల నాగ వెంకట రమణ, అనూష కుటుంబాలకు అమలాపురం లయన్స్ క్లబ్ సాయం అందించింది. 26 కేజీల బియ్యం, కిరాణా, కూరగాయలు, దుస్తులను క్లబ్ అధ్యక్షుడు సూదా గణపతి, కార్యదర్శి లయన్ బీవీ హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం అందించారు. పూర్వపు అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, లయన్స్ ప్రతినిధులు కొత్త కృష్ణ, సుగ్గు గోపాలకృష్ణ, పట్నాల రమణ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం



గ్రాంటు గ్రామంలో పందిరి రాట ముహూర్తం చేస్తున్న అర్చకులు, ప్రముఖులు

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలోని యానాం–గిరియాంపేట రహదారి చెంతన ఓఎన్జీసీ కంపెనీ వద్ద కొలువైన పాల కనకదుర్గమ్మ ఆలయం వద్ద బుధవారం దసరా ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం చేశారు. ఏటా ఇక్కడ దేవీ నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వర శర్మ, తాడిపూడి రామ హనుమాన్ ప్రత్యేక పూజలు నిర్వహించి రాట వేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకూ దసరా శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు.



యానాంలో బ్రహ్మోత్సవాలకు..

యానాం: యానాంలోని భూ సమేత వేంకటేశ్వర స్వామి (మీసాల వెంకన్న) 23వ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రాట ముహూర్తం ఘనంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి జ్యోతి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, నరసింహాచార్యులు, దేవస్థానం మాజీ చైర్మన్ కాపగంటి ఉమాశంకర్ పాల్గొన్నారు.

అబద్ధపు హామీలతో చంద్రబాబు మోసం

- అయినాపురంలో వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం
- ఉత్సాహంగా బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి చిట్టిబాబు

ముమ్మిడివరం: అమలు కాని హామీలు, అబద్ధాలతో గద్దె నెక్కి ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, కార్యక్రమం గ్రామ అబ్జర్వర్ కాశి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పెయ్యల చిట్టిబాబు పిలుపు నిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా అయినాపురంలో బుధవారం పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలు, చేసిన మోసాలను ప్రజలకు వివరించాయి. తొలుత గ్రామ కమిటీ అధ్యక్షుడు చప్పిడి వెంకట రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబు మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కాశి బాల మునికుమారి, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా సుపరిపాలన అంటూ టీడీపీ నాయకులు ఇంటింటికి తిరుగుతున్నారన్నారు. ముమ్మిడివరం టౌన్ అధ్యక్షుడు బొంతు సత్య శ్రీనివాస్, మండల అధ్యక్షుడు జగతా పద్మనాభం, వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, పార్టీ జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు కాశి వెంకట రమణ, రైతు విభాగం అధ్యక్షుడు పళ్ల వీరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ మోసాలను గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కాట్రు అప్పారావు, బొర్రా విష్ణు, ఎస్వీ సుబ్బారావు, రేకాడి వర్మ, దువ్వూరి శ్రీనివాసరావు, ఇసుకపట్ల శివకుమార్, బళ్ల రమేష్, పచ్చిమాల సత్యనారాయణ పాల్గొన్నారు.



అయినాపురంలో ప్రజలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

ఘనంగా పెరియార్ జయంతి



ఆర్ఏవో అంకిత్ కుమార్‌ను సత్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

యానాం: ద్రావిడ ఉద్యమ నిర్మాత పెరియార్ రామస్వామి జయంతిని బుధవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెర్రీ రహదారిలోని పెరియార్ విగ్రహానికి ఆర్ఏవో ఐఏఎస్ అంకిత్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐ అడలరసన్, టీచర్ రామలక్ష్మణుడు, పీఆర్ఏ ప్రసాద్ పాల్గొన్నారు

- యానాం పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే నల్ల చెరువు రక్షిత తాగునీటి పథకాన్ని ఆర్ఏవో అంకిత్ కుమార్ పరిశీలించారు. అనంతరం గిరియాంపేటలో జరిగిన ఎస్ఎస్ఎస్పీఏ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- పిల్లారాయస్వామి లక్ష్మీగణపతి ఆలయాన్ని ఆర్ఏవో దర్శించుకుని, స్వామివారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు నల్లా వెంకన్న, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలకర్త విశ్వకర్మ



అమలాపురంలో విశ్వకర్మ చిత్ర పటానికి పూజలు చేస్తున్న పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంఘాల ప్రతినిధులు

అమలాపురం టౌన్: విశ్వకర్మ సృష్టికి మూలకర్తని, ఆ మహనీయుడు ప్రపంచానికే ఓ ఇంజినీర్ అని జిల్లా చేతి వృత్తుల సంఘం అధ్యక్షుడు, వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి అన్నారు. విశ్వ కర్మ జయంతి సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జయంతి కార్యక్రమంలో సూర్యనారాయణమూర్తి మాట్లాడారు. తొలుత విశ్వ కర్మ చిత్రపటానికి పూజలు చేశారు.

- అమలాపురం పట్టణ, మండల విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకార సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో దుడ్డివారి అగ్రహారంలోని విశ్వ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ మహా యజ్ఞ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ అప్పలాచార్యులు ఉపన్యసించారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లికి చెందిన లక్కోజు నాగ సత్య సూర్యనారాయణమూర్తి, శ్రీదేవి దంపతులు తొలుత కలశ స్థాపన చేసి మహా యజ్ఞ మహోత్సవాలను ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్ కట్టోజు సన్నయ దాసు, పట్టణ, మండల సంఘాల ప్రతినిధులు పుల్లేటికుర్తి భాస్కరరావు, తాళాబత్తుల లక్ష్మణరావు, భరణికాన బాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: స్థానిక విష్ణాలయం సెంటర్‌లోని విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశ్వకర్మ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు.

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ గాదిరాజు విశ్వనాథరాజు ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. ధర్మ ప్రచారక్ బొంతు కనకారావు మాట్లాడుతూ విశ్వకర్మ చేతుల్లో ఎన్నో పట్టణాలు రూపొందాయని తెలిపారు.

కరెన్సీ నోట్లతో వినూత్నంగా..



ప్రధాని మోదీ పుట్టిన తేదీ, పేరు వచ్చేలా తీర్చిదిద్దిన కరెన్సీ నోట్లు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేరు, పుట్టిన తేదీ వచ్చేలా అమలాపురానికి చెందిన కరెన్సీ నోట్ల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ నోట్లను సేకరించారు. మోదీ 75వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం ఆ నోట్లతో 17-09 - 1950 అంకెలు వచ్చేలా రూపొందించారు. అలాగే నరేంద్ర మోదీ పేరు వచ్చేలా కరెన్సీ నోట్లపై ఇంగ్లిషు అక్షరాలు ఉన్న నోట్లను పేర్చి తీర్చిదిద్దారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జానకి

ఉప్పలగుప్తం: ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ దంగేటి వీర అచ్యుత జానకి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఇన్‌చార్జి ఎంపీడీవో బి.తులసీ కృష్ణ బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు మండలంలోని సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల అవసరాలను అధికారులు గుర్తించి, వారికి ఇబ్బంది లేకుండా పనిచేయాలని కోరారు. మండలంలో చాలా గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సర్పంచులు జిన్నూరి వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి రామచంద్రరావు అన్నారు. మినీ గోకులాలు ఏర్పాటు చేసుకున్న రైతులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నుంచి డబ్బులు జమ కాలేదని చిక్కం జంగమయ్య తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వం నడిపించాలని గోపవరం ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు కోరారు. ఈ సమావేశానికి రిజిస్ట్రేషన్, ఎక్సైజ్, ఉద్యాన, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు గైరాజరయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సాదే శ్రీనివాసరావు, నడింపల్లి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పెట్టా అప్పారావు, చిక్కం త్రినాథ్, వంగా గిరిజాకుమారి, అంగాని అనంతలక్ష్మి, కాట్రు ధనలక్ష్మి, వరసాల వెంకటలక్ష్మి, సలాది సురేఖవాణి, నిమ్మకాయల స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

అమలాపురం రూరల్: ఏడాప్ట్ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా దత్తత తీసుకున్న వన్నె చింతలపూడి గ్రామంలో పరమహంస యోగానంద కంటి హాస్పిటల్, ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వేమగిరి వారిచే బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నడింపల్లి వెంకట రామరాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 254 మందికి కంటి పరీక్షలు చేయగా, వారిలో 22 మందిని ఆపరేషన్ కోసం వేమగిరికి పంపించారు. మరో 110 మందికి కళ్లజోళ్లు అందిస్తామని వెంకట రామరాజు తెలిపారు. సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, ఎంపీటీసీ సభ్యురాలు పరమట నాగమణి, మాజీ సర్పంచ్ పరమట మోహన్ కుమార్, ఉప సర్పంచ్ యర్రంశెట్టి వీరభద్రరావు, నడింపల్లి అర్జున్ వర్మ, ఉదయబాబు, పరమట సురేష్ పాల్గొన్నారు.

బాలికలకు వైద్య పరీక్షలు

యానాం: జిప్‌మెర్ ప్రభుత్వ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి ఆనంద్ రాజ్ ఆధ్వర్యంలో వైద్యులు బుధవారం స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల హైస్కూల్లోని సుమారు వంద మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి పలు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ఆవశ్యకతను వివరించారు.

దొమ్మేటిపేటలో డ్రైనేజీ పరిశీలన

యానాం: దొమ్మేటిపేట గ్రామంలోని డ్రైనేజీని బుధవారం ఆర్ఏవో, ఐఏఎస్ అధికారి అంకిత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఆ డ్రైనేజీలోకి వివిధ పరిశ్రమలు రసాయన వ్యర్థాలు వదులుతున్నారని, వాటితో తామంతా అనారోగ్యం బారిన పడుతున్నామని ఆ గ్రామస్తులు, పర్యావరణ పరిరక్షణ సమితి కో ఆర్డినేటర్ దగ్గుదుర్తి అనిత తదితరులు గతంలో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆర్ఏవో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పరిశ్రమలు వదిలే వ్యర్థాలతో శ్వాసకోశ వ్యాధులు, చర్మవ్యాధులకు గురవుతున్నామన్నారు. తమ ఇళ్లలోని స్టీలు గ్లాసులు, ప్లేట్లు, రాగి వస్తువులు నల్లగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన అంకిత్‌కుమార్ మాట్లాడుతూ ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

‘స్వస్థ్ నారీ’తో ఆరోగ్య పరిరక్షణ



అమలాపురంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ దుర్గారావు దొర, చిత్రంలో ఎంపీ, ఎమ్మెల్యేలు

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఎంపీ గంటి హరీష్ మాధూర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. మెరుగైన ఆరోగ్య పరిరక్షణ ద్వారా మహిళలు, పిల్లలకు సాధికారత కల్పించే దిశగా ప్రధాన మంత్రి మోదీ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి అక్టోబర్ 2వ వరకూ ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు జిల్లాలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, మండల ఆరోగ్య కేంద్రాలు ద్వారా మహిళలకు, పిల్లలకు ప్రత్యేక వైద్యం అందిస్తారని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర తెలిపారు. ముందుగా ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో రూ.45 లక్షలతో నిర్మించనున్న వన్ స్టాప్ వుమన్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

కాట్రేనికోన: దొంతికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద కాట్రేనికోన పీహెచ్‌సీ వైద్యాధికారి నీలిమ ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ కార్యక్రమం జరిగింది. సర్పంచి గిడ్డి ఈశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొని మహిళలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

అల్లవరం: స్త్రీలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబంలోని సభ్యులందరూ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. స్వస్థ్ నారీ కార్యక్రమంలో భాగంగా గోడిలంక పీహెచ్‌సీలో వైద్యాధికారి స్పందన ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

పాఠశాలకు వితరణ

అమలాపురం రూరల్: వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.75 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్, ఫ్యాన్లను ఐడీబీఐ అమలాపురం శాఖ వితరణ చేసింది. వీటిని సమనస సర్పంచ్ పరమట శ్యామ్ కుమార్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు చేతుల మీదుగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుబ్బల నాగ సత్యనారాయణకు అందించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ బ్రహ్మతేజ, రాజోలు బ్రాంచ్ మేనేజర్ శివ శేఖర్ కుమార్, ఐడీబీఐ బ్యాంక్ సిబ్బంది ఎన్.ప్రకాష్, కె.బాలకృష్ణను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వన్నె చింతలపూడి సర్పంచ్ నక్కా రాజారత్న నాగవాణి, సమనస ఉప సర్పంచ్ మామిళ్లపల్లి దొరబాబు, పరమట బీమా మహేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సెల్ఫీ పాయింట్ అదుర్స్



ఆకట్టుకుంటున్న సెల్ఫీ పాయింట్

యానాం: రాజీవ్ రివర్ బీచ్‌కు మరింత అందాన్ని తెచ్చేలా ‘ఐ లవ్ యానాం’ అనే ఆంగ్ల అక్షరాలతో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను బుధవారం ప్రారంభించారు. దీంతో అక్కడ ఫొటోలు దిగేందుకు సందర్శకులు పోటీ పడ్డారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆలోచనతో ఇది రూపు దిద్దుకుంది.